# నామినేషన్లకు పకడ్బందీగా ఏర్పాట్లు

- కలెక్టర్ వెంకట్రావ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట, అక్టోబర్ 29 : సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ నవంబర్ 3 నుంచి ప్రారంభమవుతుందని, అందుకోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియలో పోస్టల్ బ్యాలెట్, సువిధయాప్ ద్వారా అనుమతులు, కౌంటింగ్ హాల్, కౌంటింగ్ ఏజెంట్ల నియామకం, నామినేషన్లు, వాటి నిబంధనల గురించి రాజకీయ పార్టీల ప్రతినిధులు అవగాహన కలిగి ఉండాలన్నారు. నియోజకవర్గ కేంద్రంలోని రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో నామినేషన్ ప్రక్రియ ఉంటుందన్నారు. నామినేషన్ల స్వీకరణ తేదీ నుంచి గడువు ముగిసే వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆయా కార్యాలయం చుట్టూ 100 మీటర్లు పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇతరులెవరూ ఆ ప్రాంతంలోకి రాకూడదన్నారు. నామినేషన్ వేసే వారితో పాటు మరో నలుగురిని మాత్రమే లోనికి అనుమతిస్తామని చెప్పారు. నామినేషన్ల ప్రక్రియను పూర్తిగా సీసీ కెమెరాల్లో, వీడియో గ్రఫీ ద్వారా రికార్డు చేయనున్నట్లు తెలిపారు. నామినేషన్ల ప్రక్రియపై అభ్యర్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. వికలాంగులు, 80 సంవత్సరాల పైబడిన ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. అందుకోసం ఫామ్– 12 డీ అందిస్తున్నట్లు చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ సేకరణ బీఎల్ఓల విధుల గురించి రాజకీయ ప్రతినిధులు అవగాహన కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి అవసరమైన అనుమతుల కోసం సువిధ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల సమావేశాలు, సభల నిర్వహణకు, ర్యాలీలు, వాహనాల కోసం, తాత్కాలిక ఎన్నికల కార్యాలయాలకు, లౌడ్ స్పీకర్ల కోసం https://suvidha.eci.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోలన్నారు. నవంబర్ 30న ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే ఓటింగ్ యంత్రాలను జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తారన్నారు. డిసెంబర్ 3న నియోజక వర్గాల వారీగా కౌంటింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, సీపీఓ వెంకటేశ్వర్లు, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# హామీలను నెరవేర్చిన ఘనత బీఆర్ఎస్‌దే

- బీఆర్ఎస్ ప్రచారంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ



సూర్యాపేటలోని 9వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ

బొౖడ్రాయిబజార్, అక్టోబర్ 29 : గత ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడంతో పాటు, ఇవ్వని పథకాలను సైతం అమలు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆదివారం పట్టణంలోని 9వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత పదేండ్లుగా వేల కోట్ల రూపాయలతో సూర్యాపేటను అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ముందుంచిన ఘనత మంత్రి జగదీశ్‌రెడ్డిదే అన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించారని.. రాబోయే రోజుల్లో మరిన్ని పతకాలు అమలు చేయనున్నట్లు మ్యానిఫెస్టోలో ప్రకటించినట్లు చెప్పారు. నియోజకవర్గ ప్రజలు మంత్రి జగదీశ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి సీఎం కేసీఆర్‌కు కానుకగా అందించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ వార్డు నాయకులు గుండగాని నాగభూషణం, నీలాల లక్ష్మయ్య, మచ్చ రాము, బొడ్డు దుర్గయ్య, ఈదుల లక్ష్మయ్య, నవిలె విజయ్, పందిరి సైదులు, గుంజ శ్రీను, బొజ్జ సందీప్, గడ్డం వెంకటేశ్, కుమ్మరి శ్రీకాంత్, అన్వర్‌పాషా, బండమీది రజిత, పందిరి సువర్ణ, నీలా నాయక్, నర్రా సువార్త, బొల్లెద్దు విజయ్, మహేశ్వరి, బండారి కమల్, బాలెంల సాయికుమార్, కంకణాల సందీప్, పవన్, గోపి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మరో మారు మంత్రి జగదీశ్‌రెడ్డిని ఆశీర్వదించండి : సుధీర్‌రావు

చివ్వెంల : సూర్యాపేటలో అభివృద్ధి కొనసాగించేందుకు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని మరో మారు ఆశీర్వదించాలని పీఏసీఎస్ చైర్మన్ మారినేని సుధీర్‌రావు కోరారు. ఆదివారం మండలంలోని బండమీది చందుపట్ల గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన పదేండ్లలో సూర్యాపేట నియోజక వర్గంతో పాటు ఉమ్మడి జిల్లా అభివృద్ధికి మంత్రి నిరంతరం కృషి చేశారన్నారు. రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల కోసం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, వాటిని అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా మంత్రి కృషి చేశారన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగించేందుకు మంత్రి జగదీశ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమం లో సర్పంచ్ బోయిళ్ల కృష్ణ, శిగ వీరస్వామి, కోడి కృష్ణ, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## ఎండ్లపల్లిలో బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం

సూర్యాపేట రూరల్ : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి సూర్యాపేట ఎమ్మెల్యేగా మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మండలంలోని ఎండ్లపల్లి గ్రామంలో ఆదివారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కుంట్ల భీష్మారెడ్డి, బుడిగె నవీన్, ఉయ్యాల రవి, సురారపు జానయ్య, పంతంగి శ్రీనివాస్, జానయ్య, మోహన్‌రెడ్డి, రాంరెడ్డి, శివరామక్రిష్ణ, సందీప్, పండు పాల్గొన్నారు.



సూర్యాపేట రూరల్ : మంత్రి జగదీశ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఎండ్లపల్లిలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



చివ్వెంల : బండమీది చందుపట్లలో బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని ప్రచారం చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ సుధీర్‌రావు



అర్వపల్లి నుంచి సభకు బయల్దేరిన బీఆర్ఎస్ శ్రేణులు

# సమర శంఖారావం సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

**తిరుమలగిరిలో ఆదివారం జరిగిన సమర శంఖారావం సభకు ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరైన దృష్ట్యా తుంగతుర్తి నియోజకవర్గం నుంచి ప్రజలు భారీగా తరలి వెళ్లారు. దాంతో తిరుమలగిరి పట్టణమంతా గులాబీమయంగా మారింది.**



నాగారం : వర్ధమానుకోట నుంచి తరలివెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



నూతనకల్ : మండలకేంద్రం నుంచి తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

# తిరుమలగిరి జనసంద్రం

- తండోపతండాలుగా తరలొచ్చిన జనం
- తుంగతుర్తి సమరశంఖారావ సభ గ్రాండ్ సక్సెస్

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్29(నమస్తే తెలంగాణ)/తిరుమలగిరి తిరుమలగిరిలో జరిగిన ఆదివారం జరిగిన తుంగతుర్తి సమరశంఖారవం బహిరంగసభ విజయవంతమైంది. పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ పాల్గొన్న ఈ సభకు ఊహించిన దాని కంటే జనం తండోపతండాలుగా తరలివచ్చారు. తిరుమలగిరి పట్టణమంతా ఎటూ చూసినా జన ప్రభంజనమే కనిపించింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి మొదలైన జన ప్రవాహం సాయంత్రం సభ ముగిసే వరకు కొనసాగింది. నియోజకవర్గం నలూమూలల నుంచి తిరమలగిరికి చేరుకునే అన్ని రహదారులు గులాబీమయమయ్యాయి. ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం తిరుమలగిరిలో ఏర్పాటు చేసిన సమరశంఖారావం సభ ఆద్యంతం జోరుగా హుషారుగా సాగింది. సభలో పెద్ద ఎత్తున యువత భాగస్వాములు కావడం విశేషం. చిన్నపెద్దా, ఆడ, మగ తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు బహిరంగసభకు తరలివరావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. కేసీఆర్ హాట్రిక్ సీఎం కావాలి..కిశోర్ హాట్రిక్ ఎమ్మెల్యే కావాలి..అంటూ కళాకారులు నినదిస్తే..సభా ప్రాంగణం అరుపులు, కేకలతో దద్దరిల్లిపోయింది. సీఎం కేసీఆర్ అండదండలతో జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి మార్గదర్శనంలో తుంగతుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ప్రకటించారు. ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అధ్యక్షతన తిరుమలగిరిలో ఆదివారం మధ్యాహ్నం తుంగతుర్తి సమర శంఖరావం బహిరంగసభ జరిగింది. ఈ సభకు అధినేత, సీఎం కేసీఆర్ ముఖ్య అతిథిగాహాజరయ్యారు. కోదాడలో సభలో పాల్గొన్న కేసీఆర్ హెలిక్యాప్టర్‌లో జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి మధ్యాహ్నం 3.50 గంటలకు తిరుమలగిరి చేరుకున్నారు. వీరికి ఎమ్మెల్యే కిశోర్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. నేరుగా సీఎం కేసీఆర్ సభావేదికపైకి చేరుకోవడంతో సభికులంతా ఒక్కసారిగా చప్పట్లు, ఈలలు, కేకలతో స్వాగతించారు. అంతుకు ముందు నియోజకవర్గ వ్యాప్తంగా తరలివచ్చిన జనంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. సూర్యాపేట– జనగాం హైవే పక్కనే ఏర్పాటు చేసిన సభా స్థలంతో పాటు బయట కూడా వేలాది మంది జనంతో జనప్రభంజనాన్ని తలపించింది.

## యువత ప్రత్యేక ఆకర్షణ

సమరశంఖారావం బహిరంగసభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన యువత ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సభా వేదికకు ఎదురుగా అన్ని వైపులా యువత భారీగా సందడి చేశారు. కిశోర్‌కుమార్ యువ ఎమ్మెల్యే కావడం... ఆయనకు ఎక్కడికెళ్లినా యువతతో మంచి సం బంధాలు ఉండడంతో ఆ ప్రభావమంతా సభలో కనిపించింది. దాంతో సభలో కూడా ఆద్యంతం యువత జోష్ స్పష్టమైంది. మిట్టపల్లి సురేందర్ ఆధ్వర్యంలో సాగిన ఆటాపాటాలకు యువత చేసిన సందడి మా మూలు కాదు. కిశోర్ ప్రసంగ సమయంలోనూ, సీఎం కేసీఆర్ ప్రసంగ సమయంలోనూ కేరింతలు, ఈలలు, నినాదాలతో యువత స్పందించడం విశేషం. ప్రారంభంలో కేసీఆర్ సైతం యువత కేరింతలు ఆపాలని కోరగా ఎమ్మెల్యే కిశోర్ వీళ్లను సైగలతో వద్దంటూ ఆపాల్సివచ్చింది. కిశోర్‌కుమార్‌ను లక్ష మెజార్టీతో గెలిపించాలని కోరినప్పుడు సభా ప్రాంగణమంతా కేరింతలతో దద్దరిల్లింది. సభా లోపల, బయట కూడా యువత భాగస్వామ్యం పెద్ద ఎత్తున ఉండడంతో యువతలో కిశోర్‌కుమార్‌కు ఉన్న అభిమానం వెల్లడైంది.